సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం ¦ 6 ¦ ఫిబ్రవరి ¦ 2024



వంజంగి హిల్స్ 'స్నో'యగం

సాక్షి,పాడేరు: వంజంగి మేఘాల కొండలపై సోమవారం ప్రకృతి, మంచు అందాలు పర్యాటకులకు కనువిందు చేశాయి.



వీడీవీకే ఉత్పత్తులతో ఉపాధి

ఏజెన్సీలో వన్‌ధన్ వికాస్ ఉత్పత్తులతో గిరి జన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ తెలిపారు. 8లో



తెప్పోత్సవానికి ఏర్పాట్లు

ఈనెల 9న నిర్వహించనున్న శ్రీ వరాహా లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం ఏర్పాట్లు చేస్తున్నట్లు, దేవస్థానం ఈవో తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో 30 మంది చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న సమన్వయకర్త రేగం మత్స్యలింగం

అనంతగిరి: మండలంలోని కొనపురం పంచాయతీ కర్రాయిగుడ గ్రామానికి చెందిన 30 మంది టీడీపీ నాయకులు అరకులోయ సమన్వయకర్త రేగం మత్స్యలింగం సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామ పెద్ద దొన్ను, టీడీపీకి చెందిన ముఖ్యనాయకులు కొండలరావు, పూజారి లక్ష్మణ్‌తో పాటు 30 మంది స్థానిక సర్పంచ్ అప్పలమ్మ, నాయకుడు దొంబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మత్స్యలింగం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

శరవేగంగా ఘాట్ రోడ్డు విస్తరణ పనులు



చింతాలమ్మ ఘాట్ రోడ్డు

కొయ్యూరు: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చింతాలమ్మ ఘాట్‌రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డులో మొత్తం ఏడు ఇరుకైన "U" ఆకారపు మలుపులున్నాయి. వాటిని ఇప్పుడు వెడల్పు చేస్తున్నారు. గతంలో ఇరుకైన మలుపుల వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రోడ్డును విస్తరించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం లేదు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవున విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులను అధికారులు డ్రోన్ ద్వారా చిత్రీకరించారు.

అతి వేగం ప్రమాద హేతువు



మాట్లాడుతున్న ఏఎస్పీ రాహుల్ మీనా

చింతూరు: వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏఎస్పీ మాట్లాడుతూ మితిమీరిన వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎంవీఐ ఆనందరావు మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లెర్నర్ లైసెన్స్ రాతపరీక్ష, డ్రైవింగ్ టెస్ట్, సైన్‌బోర్డుల గురించి రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీఐ గజేంద్ర కుమార్, ఏపీజెన్‌కో ఏఎస్‌వో సూర్యమోహన రావు, అసిస్టెంట్ ఎంవీఐలు జగదీష్, శ్వేతసాయి పాల్గొన్నారు.

'స్పందన'కు 53 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

రంపచోడవరం: స్థానికఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ 53 అర్జీలు స్వీకరించారు. ఆరు కిలోమీటర్ల సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని వై.రామవరం మండలం కానివాడ సర్పంచ్ పల్లాల శిల్పారాణి, పల్లాల రాఘవమ్మ కోరారు. జాఫ్రా పంటను ఆరబెట్టేందుకు టార్పాలిన్లు మంజూరు చేయాలని ఆకూరు పంచాయతీ పరిధిలో గిరిజనులు, సర్పంచ్ పండ్ర సరస్వతి, కత్తుల రామకృష్ణారెడ్డి అర్జీ అందజేశారు. మడేరువాగు నుంచి నీళ్లు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన ఇనుప షట్టర్లకు నగదు మంజూరు చేయాలని రైతులు కోరారు. స్పందనలో ఎస్‌డీసీ డి.ఎస్.శాస్త్రి, డీడీ కె.అబ్షలోము, డీఎల్‌పీవో రాఘవన్, ఈఈ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

విశాఖ.. హ్యాట్రిక్

- వైఎస్సార్ స్టేడియంలో వరుసగా మూడు టెస్టు మ్యాచ్‌ల్లో భారత్ విజయం
- 2016లో తొలిసారి ఇంగ్లండ్, 2019లో దక్షిణాఫ్రికా, 2024లో ఇంగ్లండ్‌ని మట్టికరిపించిన భారత్



ఇంగ్లండ్ ఆటగాడు వికెట్ ఇలా ఎగిరింది



వికెట్ తీసిన ఆనందంలో బుమ్రా



వికెట్ తీసిన ఆనందంలో..





హిట్ మ్యాన్ పోస్టర్ ప్రదర్శిస్తున్న అభిమాని



ఇంగ్లండ్ అభిమానులు



అభిమానుల సందడి







విశాఖ స్పోర్ట్స్ : అంతర్జాతీయ క్రికెట్ అన్ని ఫార్మాట్లతో పాటు దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లకు ఆతిథ్య మిచ్చిన విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో సోమవారం మరో మైలురాయిను అందుకుంది. వైఎస్ఆర్ స్టేడియంలో ఇప్పటికి మూడు టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. మూడింట విజయాలతో ఆతిథ్య జట్టు హ్యాట్రిక్ నమోదు చేసింది. తొలిసారి ఇంగ్లండ్ జట్టుతోనే 2016లో వైఎస్ఆర్ స్టేడియంలో టెస్ట్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌ల్లో భారత్ 246 పరుగుల తేడాతో విజయం సాధించింది. తర్వాత 2019లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 203 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముచ్చటగా మూడో మ్యాచ్ మళ్లీ ఇంగ్లండ్ జట్టుతోనే ఆడి 106 పరుగుల తేడాతో విజయం సాధించి హ్యాట్రిక్‌ను నమోదు చేసింది. అయితే ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ భారత్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌ను ఎంచుకునే విజయకేతనం ఎగురవేయడం గమనార్హం. ఐదు రోజుల మ్యాచ్ నాలుగు రోజుల్లోనే ముగిసింది. స్టేడియంలో నిర్వహించిన బెస్ట్ అవార్డుల ప్రదానోత్సవం తర్వాత ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మ్యాచ్‌లకు అన్నిహంగులతో వైఎస్ఆర్ స్టేడియం ఉండటంతో మరిన్ని మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చేందుకు బీసీసీఐ సముఖత వ్యక్తం చేసిందన్నారు. విశాఖ పిచ్ పట్ల బీసీసీఐ, ఆతిథ్య జట్టు కెప్టెన్, కోచ్‌లు సైతం సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి మరిన్ని సంస్కరణలు చేపట్టనున్నామన్నారు. ఇదిలా వుండగా మ్యాచ్ తొలి రోజు మూడు వేల మంది విద్యార్థులతో సహా 15వేల మంది వీక్షించగా రెండో రోజు ఐదు వేల మంది విద్యార్థులతో పాటు 14500మంది వీక్షించారు. ఇక ఆదివారం రోజు ఏడువేల మంది విద్యార్థుల్ని అనుమతించగా మొత్తంగా 19 వేల మంది, సోమవారం అనుమతించిన ఏడు వేల మంది విద్యార్థులతో పాటు 17వేల మంది మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.

పరిశ్రమలు స్థాపించే స్థాయికి రైతులు ఎదగాలి

అటారీ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా



సమావేశంలో పాల్గొన్న అటారీ డైరెక్టర్ షేక్ ఎన్‌మీరా, వీసీ జానకీరామ్

రంపచోడవరం: రైతులు పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదగాలని, అందుకు కేవీకే కృషి చేయాలని అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (అటారీ) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. స్థానిక పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన 12వ శాస్త్రీయ సలహా మండలి సమావేశంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ జానకీరామ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలో విరివిగా పండించే జీడిమామిడి, జాఫ్రా, కోళ్ల ముడిసరుకుగా పరిశ్రమల స్థాపనకు కేవీకే ద్వారా పూర్తి సహకారాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మార్కెట్ లింకేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేవీకే ద్వారా రైతులకు క్షేత్రస్థాయిలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందించే దిశగా పనిచేస్తున్నట్టు తెలిపారు. అనంతరం బయోఫ్లాక్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా గిరిజన మత్స్యకారులకు విత్తన చేపల పిల్లలను అందించాలని తెలిపారు. వీసీ జానకీరామ్ మాట్లాడుతూ ఏజెన్సీలో స్వచ్ఛంద సంస్థలు రైతుల సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. కోతుల నిర్మూలనకు సామూహికంగా రైతులు కృషి చేయాలని చెప్పారు. జాఫ్రాకు మంచి మార్కెట్ సదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. మంకీ గన్స్, సోలార్ ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రంపచోడవరం కేవీకే కోఆర్డినేటర్ లలితా కామేశ్వరి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల సాంకేతిక ఫలితాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ రూపొందించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె. వీరాంజనేయులు, క్రాంతికుమార్, చిరంజీవి ప్రవీణ్ ఏడాది పాటు క్షేత్రస్థాయిలో వచ్చిన ఫలితాలను వివరించారు. పీహెచ్‌వో చిట్టిబాబు,ఏవో లక్ష్మణరావు, పీఏవో రాంబాబు, హెచ్‌వో ముత్తయ్య, ఏడీఏ చౌదరి తదితరులు పాల్గొన్నారు. మహిళలు ఏర్పాటు చేసిన చేపలు, రొయ్యల ఉత్పత్తులు, జీడిమామిడి, పుట్టగొడుగులు, తాటాకులతో తయారు చేసి వస్తువులను పరిశీలించి, అభినందించారు.

ఎస్‌ఐలుగా ఎంపికైన యువకులకు ఎస్పీ అభినందనలు



యువకులను అభినందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు: జిల్లా నుంచి తొమ్మిది మంది యువకులు ఎస్‌ఐలుగా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో ఆ తొమ్మిది మంది యువకులను ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించి, దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ఎస్‌ఐలుగా ఎంపికైన వారిలో సీదరి శ్రీనివాస్, బోనంగి సాయిరాం పడాల్, గుజ్జెలి కమల్ భార్గవ్, ఎస్‌కే జిలానీ, కారం క్రాంతి, వీసం శెట్టి నానీ, పోతంశెట్టి వీరచక్రదొర, సిద్ద దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు ఉన్నారని చెప్పారు. శిక్షణ, విధులపై వీరికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) అనిల్ పులిపాటి, ఎస్‌బీ సీఐ హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

33 టన్నుల చెర్రీ కాఫీ గింజల విక్రయం

కిలో రూ.140 ధరతో వేలం ఖరారు



వేలంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికారులు, కాఫీ వ్యాపారులు

సాక్షి,పాడేరు: చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్, చింతపల్లి మాక్స్ సంస్థ సేకరించిన 33 టన్నుల చెర్రీ రకం కాఫీ గింజలను కిలో రూ.140 ధరకు వేలం ద్వారా విక్రయించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లు సోమవారం కలెక్టరేట్‌లో 150 మెట్రిక్ టన్నుల పార్చ్‌మెంట్, 33టన్నుల కాఫీ గింజల విక్రయానికి వేలం నిర్వహించారు. పాడేరు పట్టణానికి చెందిన మోదమాంబ ట్రేడర్స్ యజమాని సయ్యపురెడ్డి శ్రీను చెర్రీ రకం గింజలను కిలో రూ.140 ధరతో కొనుగోలుకు ముందుకు రావడంతో ఆయనకు విక్రయించేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. అయితే పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.200 ధరతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాగా, రూ.305 కంటే ధరకు పార్చ్‌మెంట్ గింజలను అమ్మడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేస్తూ పార్చ్‌మెంట్ కాఫీ గింజల వేలంను వాయిదా వేశారు. కాఫీ గింజల అమ్మకాల ద్వారా వచ్చే లాభాలను కాఫీ పండ్లు అమ్మిన గిరిజన రైతులకు బోనస్‌గా చెల్లించాల్సి ఉందని, మంచి ధర వచ్చేవరకు వేచి ఉంటామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాఫీ ఏడీ అశోక్, డీడీ రమేష్, ఎకో పల్పింగ్ యూనిట్ అకౌంటెంట్ సత్యనారాయణ, బెంగళూరుకు చెందిన ట్రేడర్లు పాల్గొన్నారు.

తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.10గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం-తిరుపతి (08583) స్పెషల్ సుమారు 3గంటలు ఆలస్యంగా రాత్రి 10గంటలకు విశాఖపట్నంలో బయల్దేరింది. పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలు విశాఖపట్నంలో ఆలస్యంగా బయల్దేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో రూ.కోట్లతో అభివృద్ధి పనులు

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



మాలగుమ్మిలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని, కోట్లాది రూపాయల వ్యయంతో పలు గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. మండలంలో బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి నుంచి బి.బాదిపుట్టు గ్రామం వరకు రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామానికి రహదారి కల్పించి రవాణా వ్యవస్థను మెరుగు పరచాలని ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రవాణా సదుపాయం లేక మారుమూల గ్రామాల గిరిజనులు అవస్థలకు గురయ్యారని, ఆ సమస్య లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, అరకు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్ రత్నలమ్మ, ఎంపీటీసీలు కొండమ్మ, సుబ్బలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

డీటీ, జీసీసీ బీఎంలకు షోకాజ్ నోటీసులు

- గొడౌన్ పర్యవేక్షకుడు, సేల్స్‌మేన్‌లు ఆ బాధ్యతల నుంచి తొలగింపు
- పాఠశాలలకు బియ్యం సరఫరా చేయకపోవడంపై సబ్ కలెక్టర్ ఆగ్రహం
- జీకే వీధి జీసీసీ గొడౌన్, డీఆర్ డిపోలో నిల్వల తనిఖీ



బియ్యం సరఫరా చేయకపోవడానికి కారణాలు అడుగుతున్న సబ్ కలెక్టర్

గూడెంకొత్తవీధి: నెలల తరబడి పాఠశాలలకు మధ్యాహ్న భోజన బియ్యం సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించిన స్థానిక డిప్యూటీ తహసీల్దారు (డీటీ) కుమారస్వామి, జీసీసీ మేనేజర్ కోరాబు వెంకటరమణలకు పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గూడెంకొత్తవీధి సేల్స్‌మేన్ కె. నాగేశ్వరరావు, గొడౌన్ పర్యవేక్షకుడు సీహెచ్. కృష్ణారావును వెంటనే ఆ బాధ్యతలనుంచి తొలగించాలని జీసీసీ అధికారులను ఆదేశించారు. 12 పాఠశాలలకు నెలల తరబడి బియ్యం సరఫరా కావడం లేదని కలెక్టర్ సుమిత్ కుమార్‌కు రెండు రోజుల కిందట మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకురాలు కుమారి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి సోమవారం జీకే వీధిలోని డీఆర్ డిపో, గొడౌన్‌లో నిల్వలను పరిశీలించి, బియ్యం సరఫరా చేయకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. కొత్త పర్యవేక్షకుడు వచ్చేంత వరకు గొడౌన్ నిర్వహణ బాధ్యతలను పౌరసరఫరాల శాఖకు అప్పగించారు. గూడెంకొత్తవీధి డిపో బాధ్యతను అక్కడ వీఆర్‌వోకు అప్పగించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సకాలంలో సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దర్, జీసీసీ బీఎంలు ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారో సంజాయిషీ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

21 మందిపై బౌండ్ డౌన్ కేసులు



పెదబయలు తహసీల్దార్ ఎదుట 21 మందిని హాజరు పరిచిన పోలీసులు

పెదబయలు: మండలంలోని ఇంజరి పంచాయతీ ఎర్రబయలు గ్రామంలోకి ప్రవేశించి నాలుగు ఇళ్లు ధ్వంసం చేసిన 21 మందిపై బౌండ్ డౌన్ కేసులు నమోదు చేసినట్టు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ గండేరు రంగారావు, ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 2వ తేదీన కర్రలు, ఇనుపరాడ్లతో జి.మాడుగుల మండలం బొయితిల పంచాయతీ గొందిపల్లి, లిచ్చాబు, పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ వనగరాయి గ్రామాలకు చెందిన వారు దాడికి పాల్పడి నాలుగు ఇళ్ల పైకప్పులు ధ్వంసం చేసిన విషయం విధితమే. ఈ దాడులకు పాల్పడిన 21 మందిపై కేసులు నమోదు చేసి సోమవారం మండల మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో ఎర్రబయలు గ్రామానికి ఆనుకుని ఉన్న దొందిపల్లి, లిచ్చాబు,వనగరాయి గ్రామాల మధ్య భూమి వివాదం ఉండడంతో ఇరు గ్రామాల వారిని బైండోవర్ చేశామన్నారు. ఆ నిబంధనలు అతిక్రమించి మళ్లీ దాడులకు పాల్పడం వల్ల ఇప్పుడు బౌండ్ డౌన్ కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. 21 మందిలో 16 మంది పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారని తెలిపారు. ఇకపై ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సత్ ప్రవర్తనతో నడుచుకోవాలని లేకపోతే జైలు పాలయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

కొండరెడ్ల ఇళ్లకు విద్యుత్ వెలుగు

- రూ. 14.96 కోట్ల వ్యయంతో విద్యుత్ స్తంభాలు, మీటర్ల ఏర్పాటు
- ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలో ఏడు మండలాల్లోని కొండరెడ్ల (పీవీటీజీ) ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీవో మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా ఏజెన్సీలోని పీవీటీజీలు నివసిస్తున్న గ్రామాలకు రూ.14.96 కోట్ల వ్యయంతో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. రంపచోడవరం మండలంలో 45 కుటుంబాలకు, అడ్డతీగల మండలంలో 253 కుటుంబాలకు, దేవీపట్నం మండలంలో 48 కుటుంబాలకు, గంగవరం మండలంలో 57 కుటుంబాలకు, మారేడుమిల్లి మండలంలో 894 కుటుంబాలకు, రాజవొమ్మంగి మండలంలో 253 కుటుంబాలకు, వై.రామవరం మండలంలో 1,269 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ఉచితంగా మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు పీవో తెలిపారు. మొత్తం ఏడు మండలాల్లోని 314 గ్రామాల్లో 144 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 189 కిలోమీటర్లలో 3,800 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెలాఖరు నాటికి ప్రతి పీవీటీజీ ఇంటికీ విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు 930 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. రంపచోడవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యం.డి.యూసఫ్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నట్టు తెలిపారు.



కొండరెడ్ల గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

క్లుప్తంగా

సారా స్వాధీనం: ఒకరి అరెస్టు



హుకుంపేట పోలీసులకు సారాతో దొరికిన బొజ్జన్న

హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మత్స్యపురం గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు ముందస్తు సమాచారం మేరకు స్థానిక పోలీసులు గ్రామంలో దాడులు జరిపారు. ఇందులో భాగంగా సారా విక్రయిస్తున్న బురిడి బొజ్జన్న అనే వ్యక్తికి పట్టుకుని, అక్రమంగా అమ్మకాలు చేస్తున్న 16 లీటర్ల సారాను ధ్వంసం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సతీష్ మాట్లాడుతూ సారా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశం గర్వపడేలా విద్యార్థులు ఎదగాలి

- కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించిన నేషనల్ డిఫెన్స్ కళాశాల బృందం
- ప్రభుత్వంపై ప్రశంసల జల్లు



బహుమతులు అందిస్తున్న నేషనల్ డిఫెన్స్ కళాశాల బృందం



బృందానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు, సిబ్బంది

భీమునిపట్నం: దేశం గర్వపడేలా విద్యార్థులు ఎదగాలని ఎయిర్ వైస్ మార్షల్ మనీష్‌కుమార్ గుప్త అన్నారు. విద్యారంగానికి ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం..కృషిని ఆయన అభినందించారు. భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని న్యూఢిల్లీకి చెందిన నేషనల్ డిఫెన్స్ కళాశాల సీనియర్ అధికారుల బృందం పరిశీలించింది. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, విద్యావిధానాన్ని తెలుసుకుంది. తరగతి గదులు, బోధన తీరును పరిశీలించింది. ఇస్రో అంతరిక్ష కేంద్రం ..దాని పనితీరు గురించి, ఇతర అంశాల గురించి పవర్‌పాయింట్ ద్వారా విద్యార్థులు వివరించారు. యుద్ధ నౌకలు, రక్షణ రంగానికి సంబంధించిన ప్లకార్డుల పదర్శించి, వాటి వివరాలను విశదీకరించారు. బృంద సభ్యులతో ప్రతి విద్యార్థిని ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లడడంతో వారంతా ముగ్ధులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ఎంత శ్రద్ధ పెడుతోందో స్వయంగా తెలుసుకుని అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు, యోగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వ కల్పిస్తున్న వసతులు చాలా గొప్పగా ఉన్నాయన్నారు. అందరు బాగా చదువుకుని గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభను కనబరచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, స్వర శిక్ష అదనపు ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస రావు, ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో డొంకరాయిలో మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ

మోతుగూడెం: వై రామవరం మండలం డొంకరాయిలో సీఆర్‌పీఎఫ్ ఎఫ్/42 బెటాలియన్ ఆధ్వర్యంలో నిరుపేద గిరిజన మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలంలోని బొడ్డగండి పంచాయితీ డొంకరాయిలో క్యాంప్ ఆఫీస్‌లో డిప్యూటీ కమాండెంట్ బి.రత్నమ్మ, సర్పంచ్ సంధ్యారాణిలు జ్యోతిని వెలిగించి సివిక్స్ యాక్షన్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా 15 మంది నిరుపేదలకు గిరిజన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమాండర్ రత్నమ్మ మాట్లాడుతూ డొంకరాయి సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఆఫీసులో సింధువాడ మెట్టగూడ , గంగవాడ, మంగంపాడు డొంకరాయి ఐదు గ్రామాలకు చెందిన మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు బెటాలియన్ జవాన్లు దేశభక్తి గీతాలు, గిరిజన సంప్రదాయం నృత్యాలతో అలరించారు. కమాండెంట్ చేతుల మీదగా బహుమతులు అందజేశారు. భోజన సదుపాయం కల్పించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఓ.నితిన్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్, సీవీ గౌడ, డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్, ఉప సర్పంచ్ కూన, సీఆర్‌పీఎఫ్-42 బెటాలియన్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఏయూ వీసీని కోరిన ట్రైకార్ డైరెక్టర్

చింతపల్లిరూరల్: ఆంధ్రా యూనివర్సిటీలో చదువుతున్న గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ సుర్ల లోవరాజు కోరారు. సోమవారం ఆయన ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించి, వీసీ ప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏయూలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకున్నా రు. గిరిజన విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రత్యేకంగా స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



వీసీ ప్రసాద్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు

గిరిజన యువజన ఉత్సవాల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభచాటిన విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు, ఎన్ఎస్ఎస్ పీవోలు

అరకులోయటౌన్: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగిన ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ తెలిపారు. థింసా నృత్యంలో తృతీయ స్థానం, కబడ్డీ పోటీల్లో బాలుర, బాలికల విభాగాల్లో ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ జి.మహేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, ఐక్యూఎసీ కోఆర్డినేటర్ పి. కొండబాబాబు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అప్పన్న తెప్పోత్సవానికి ఏర్పాట్లు

సింహాచలం: పుష్యబహుళ అమావాస్యని పురస్కరించుకుని ఈనెల 9న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సంబంధిత ఏర్పాట్లపై సోమవారం దేవస్థానం, పోలీస్, జీవీఎంసీ, అడవివరం ఆరోగ్యకేంద్రం, ఎస్‌పీఎఫ్, ఫైర్ శాఖల అధికారులతో దేవస్థానం కార్యాలయంలో ఈవో సమీక్ష నిర్వహించారు. అలాగే తెప్పోత్సవం జరిగే కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆరోజు సాయంత్రం 4.30 నుంచి 5 గంటల మధ్యలో స్వామివారు సింహగిరి నుంచి మెట్లమార్గంలో కొండదిగువ తొలిపావంచా వద్దకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి వరాహ పుష్కరిణి వద్దకు స్వామిని తీసుకెళ్లి సాయంత్రం 5.30 గంటల నుంచి తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 8.15 గంటల నుంచి అడవివరం పురవీధిల్లో తిరువీధి ఉంటుందన్నారు. వరాహ పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లు, అదనపు బోట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. వరాహ పుష్కరిణికి భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ, హంసాకృతి తెప్పకి విశేష పూల అలంకరణ, విద్యుద్దీప అలంకరణ చేస్తామన్నారు. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ తెప్పోత్సవం సందర్భంగా పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న గురుకుల జేఏసీ సభ్యులు

మారేడుమిల్లి: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ గురకుల సిబ్బంది జేఏసీ జిల్లా స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు సూర్యారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను అమోదించి, పలు అంశాలను చర్చించారు. సిబ్బంది సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మార్చి మొదటి వారంలో చింతూరులో జిల్లా సమావేశం ఏర్పాటుకు నిర్ణయించారు.

వైఎస్సార్ పశు బీమాపై అవగాహన



జేడీ నరసింహంను సన్మానిస్తున్న ఉద్యోగులు

దేవీపట్నం: వైఎస్సార్ పశుబీమాపై ప్రతీ పాడి రైతుకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ జేడీ నరసింహం తెలిపారు. దేవిపట్నం మండలం ఇందుకూరుపేట పశువుల ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పశు బీమా అమలుపై పలు సూచనలు అందించారు. ప్రతి రైతు పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఆ దిశగా రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జేడీ నరసింహంను పశుసంవర్ధక శాఖ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. ఏడీ గణేష్, డాక్టర్ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం సీవోఈలో ప్రవేశాలకు ఆహ్వానం



కొమ్మాది రిక్షా కాలనీలోని గురుకులం సీవోఈ

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం బాలికల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ)లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80, ఇంటర్‌లో 80 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా జ్ఞఙటు//ౖఞఘ్బుఞ్బ్ౖఞఞజటటు జీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సెప్టెంబర్ 1, 2011 నుంచి 31 ఆగస్టు 2015 మధ్య జన్మించినవారై ఉండాలన్నారు. బీసీ కన్వర్టడ్ క్రిస్టియన్(బీసీసీ), ఓసీకి చెందిన వారు 1 సెప్టెంబర్ 2013 నుంచి 31 ఆగస్టు 2015 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. తండ్రి లేదా సంరక్షకుని ఆదాయ పరిమితి ఏడాదికి లక్ష మించి ఉండకూడదని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతికి వచ్చేనెల 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్‌కు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 95509 64542, 92460 49529, 81868 97867లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ నాగమణి కోరారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కొయ్యూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో కంతారం గ్రామంలో డొంక లక్ష్మి అనే మహిళకు చెందిన తాటాకుల గుడిసె దగ్ధమైంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఈ ప్రమాదం జరిగి మంటలు వేగంగా వ్యాపించాయి. సామగ్రిని బయటకు తీసే అవకాశం లేకపోవడంతో బాధితురాలు కట్టుబట్టలతో మిగిలింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పంచాయతీ ఉప సర్పంచ్ వనంబాబు అధికారులను కోరారు.

వీడీవీకే ఉత్పత్తులతో మెరుగైన ఉపాధి

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో వన్‌ధన్ వికాస్ ఉత్పత్తులతో గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్థానిక జీసీసీ కార్యాలయం ఎదుట వీడీవీకే నిధులతో ఏర్పాటు చేసిన విస్తరాకుల తయారీ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌ధన్ వికాస్ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. విస్తరాకుల తయారీ ద్వారా 20 గిరిజన కుటుంబాలకు ఉపాధి అందుబాటులోకి రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విస్తరాకుల తయారీ యంత్రాలను ఆయన పరిశీలించారు. అడ్డాకుల సేకరణ,వాటికి నగదు చెల్లింపులపై సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్,వెలుగు ఏపీడీ మురళీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారి అనంత్ పర్వార్ సస్పెన్షన్

ఉక్కునగరం: విభాగాధిపతిను దుర్భాషలాడిన స్టీల్ ప్లాంట్ ఎల్‌అండ్‌డీసి మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సస్పెండ్ చేసింది. తక్కువ మార్కులు వేయడం వల్ల గ్రేడింగ్ తగ్గిందన్న కోపంతో పర్వార్ అదే విభాగం జీఎం ఎస్.భానును ఫోన్‌లో దుర్భాషలాడి ఆమెపై దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరిట దూషించారు. ఈ మేరకు జీఎం భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్ ప్లాంట్ పోలీసులు పర్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీస్ కమిషనర్ రవిశంకర్ సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అదే విధంగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఉక్కు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై సత్వరం స్పందించాలంటూ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు యాజమాన్యం పర్వార్‌పై చర్యలు తీసుకుంది. పర్వార్ సస్పెన్షన్‌పై ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య హర్షం ప్రకటించారు.

ఉపాధ్యాయ జేఏసీ ఛైర్మన్‌గా గోపినాథ్



విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యాయ జేఏసీ ఛైర్మన్‌గా గోపినాథ్ ఎన్నికయ్యారు. సోమవారం నగరంలో జేఏసీ ఆధ్వర్యంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులంతా గోపినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో-ఛైర్మన్‌గా చొక్కాకుల సూర్యనారాయణ(వైఎస్సార్ టీఎఫ్), సీహెచ్.కె.మూర్తి(ఎస్ఎల్‌టీఏ), ఎన్.వెంకటరెడ్డి(ఎంపీపీపీబీసీడబ్ల్యూఆర్ఎస్), మద్దు శ్రీనివాస్‌రావు(పీఆర్‌టీయూ), బీఎస్ఆర్ శర్మ(ఏపీసీఎల్ఏ)లను ఎన్నుకున్నారు.

ఉత్తమ హోంగార్డుగా కృష్ణారావు



హోంగార్డు కృష్ణారావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

నర్సీపట్నం: నర్సీపట్నం టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు కైసర్ల కృష్ణారావు ఉత్తమ సేవలకు నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ప్రశంసాపత్రం అందజేశారు. విధులను నిబద్ధతతో నిర్వర్తించడంతో పాటు 4 వేలకు పైగా ఎంవీ చలానాలు, 710 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంలో కృష్ణారావు ప్రధాన పాత్ర వహించారు. కృష్ణారావు సేవలను గుర్తిస్తూ ఏఎస్పీ ప్రశంసా పత్రం అందజేసి, మరింత సమర్థవంతంగా పనిచేయాలని ప్రోత్సహించారు. టౌన్ సీఐ కాంతి కుమార్, ఎస్సైలు సుధాకర్, మహేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



చికిత్స పొందుతున్న విద్యార్థి

కొమ్మాది: ఎండాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రుషికొండలోని గీతం యూనివర్సిటీలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న చింత నాగపవన్‌రెడ్డి (24) ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై రుషికొండ నుంచి ఎండాడ వస్తుండగా ఇదే దారిలో ఇదే యూనివర్సిటీకి చెందిన కె.హర్షవర్ధన్, ఎమ్.శ్యామ్ సుందర్ మరో బైక్‌పై అతి వేగంగా వచ్చారు. ఈ క్రమంలో ఎంవీవీఎస్ మూర్తి స్మృతి వనం వద్ద బలంగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో నాగ పవన్‌రెడ్డి సంఘటనా స్థలంలో మృతి చెందగా, హర్షవర్ధన్, శ్యామ్ సుందర్‌కు తలకు తీవ్ర గాయాలవడంతో గీతం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి విషమించడంతో నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నాగపవన్ రెడ్డి రాజమండ్రికి చెందిన వ్యక్తి. ఈయన గీతం హాస్టల్‌లో ఉంటూ ఎంబీఏ చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి ప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల చదువులకు ప్రభుత్వం తోడ్పాటు

- సంక్షేమ పథకాల అమలు భేష్
- విద్యా వ్యవస్థపై దుష్ప్రచారం సరైంది కాదు
- నాన్ పొలిటికల్ జేఏసీ చర్చాగోష్ఠి
- పాల్గొన్న విద్యారంగ మేధావులు, అధ్యాపకులు, విద్యార్థులు



చర్చాగోష్ఠిలో పాల్గొన్న విద్యావేత్తలు

విశాఖ విద్య: భవిష్యత్ తరాల బాగు కోసమని విద్యరంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంపై కొన్ని రాజకీయ పార్టీలు, పత్రికలు చేస్తున్న దుష్ప్రచారాన్ని పలువురు విద్యావేత్తలు తీవ్రంగా తప్పుపట్టారు. ప్రభుత్వ బడులు నిర్వీర్యం చేయాలనే వారి కుట్రలు, పేద విద్యార్థులను చదువులకు దూరం చేయడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. విశాఖలోని ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో 'ప్రగతి బాటలో రాష్ట్ర విద్యా వ్యవస్థ' అనే అంశంపై సోమవారం చర్చా గోష్ఠి నిర్వహించారు. పలువురు మేధావులు చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై వ్యక్తం చేసిన అభిప్రాయాలను వారి మాటల్లోనే...

జగన్ విజన్ ఉన్న నాయకుడు



చిన్న వయసులో ఎంతో గొప్ప విజన్ ఉన్న ముఖ్యమంత్రి జగన్. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, డిజిటల్ కంటెంట్ అందించడం చారిత్రాత్మకం. ఇంగ్లిషు మీడియం చదువులు పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నాయి. క్వాలిటీ ఎడ్యుకేషన్ నేడు అందుబాటులో ఉంచారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలపై కూడా బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి.

– ఆచార్య హెచ్. లజపతిరాయ్, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ

ప్రతీ విద్యార్థికి అవకాశాలు



నాణ్యమైన విద్యను అందించే విధంగా పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రపంచ స్థాయి సామర్థ్యాలను అందిపుచ్చుకునే విధంగా నాణ్యమైన విద్య వ్యవస్థను అందుబాటులో ఉంచారు.

– ఆచార్య ఎం.జగన్నాథరావు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ

అణగారిన వర్గాలు మళ్లీ బడిబాట



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేస్తున్న సంస్కరణలు ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అణగారిన వర్గాల పిల్లలు పాఠశాల బాట పడుతున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా విద్యను వ్యవస్థనను సీఎం తీర్చిదిద్దారు. నిజాలు తెలుసుకోకుండా కొంతమంది అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదు.

–ఆచార్య టి.షారోన్ రాజు, ఏయూ విద్యా విభాగాధిపతి

అక్షరాస్యత పెరుగుతోంది

దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా ఏపీ నిలుస్తోంది. విద్యార్థుల్లో నాలెడ్జ్ స్కిల్స్ పెంపొందించడం లక్ష్యంగా జరుగుతున్న కృషి, ముఖ్యమంత్రి విద్యా రంగంపై చూపుతున్న శ్రద్ధను ప్రశంసించాల్సిందే.

– పి.విశ్వనాథం, ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు

మానవ వనరుల అభివృద్ధి



దేశ అభివృద్ధికి మానవ వనరులు ఎంతో కీలకం. ముఖ్యమంత్రి దృక్పథం, పనితీరు మానవ వనరుల అభివృద్ధికి దోహదపడతాయి. నైపుణ్య చదువులతో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కల్పించేందుకు కార్పోరేట్ సంస్థలు కాలేజీలకు వస్తున్నాయి.

–ఆచార్య కె.శ్రీరామ్మూర్తి, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్

ఉపాధి అవకాశాలు పెరిగాయి



సమాజంలో అట్టడుగు వర్గాల్లో అక్షరాస్యత శాతం పెరుగుతోంది. ప్రభుత్వ నూతన విధానాలతో బోధన, విద్యకు నైపుణ్యం జోడిస్తూ ప్రతీ విద్యార్థి మెరుగైన ఉద్యోగాలు సాధించే విధంగా నేటి విద్య వ్యవస్థను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.

– సీ.హెచ్. సూర్యనారాయణ, ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ విశ్రాంత ఆచార్యులు

ఐబీ చదువులు విప్లవాత్మకం

కేవలం ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉన్న ఐబీ విద్యను నేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైతం చేరవవుతోంది.దేశంలో ఏ ప్రభుత్వం చేయనన్ని సంస్కరణలను ఏపీ ప్రభుత్వం చేసింది.

– సి.వెంకటరావు , బీవీకే కళాశాల రిటైర్డ్ లెక్చరర్